క్లుప్తంగా

గద్దర్ మరణం విప్లవ సాహిత్యానికి తీరని లోటు

పలమనేరు: ప్రజా గాయకుడిగా పేరొందిన గద్దర్ మరణం విప్లవసాహిత్యానికి తీరని లోటని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే గొంతుక శాశ్వతంగా మూగబోయిందన్నారు. తెలుగు జాతి ఉన్నంతవరకు ఆయన పాటలు అందరినీ కదలిస్తూనే ఉంటాయన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

పలమనేరు: పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ సహకారంతో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కంటి వైద్య నిపుణుడు మురళీకృష్ణ శిబిరంలో మొత్తం 75మందిని పరీక్షించారు. వారిలో 45 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వీరికి చెన్నైలోని శంకర్ నేత్రాలయలో ఆపరేషన్లు చేయనున్నట్టు తెలిపారు.

అబ్దుల్ సుభాన్ సేవలకు ప్రశంస



అబ్దుల్ సుభాన్‌కు మెడల్ అందజేస్తున్న ఫర్మాన్ సిద్ధిఖి

పలమనేరు: పట్టణానికి చెందిన హ్యూమన్ రైట్స్ సంస్థ సౌత్ ఇండియా మీడియా కార్యదర్శి అబ్దుల్ సుభాన్‌ను కడపలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆ సంఘ ఏక్తా యాంటీ కరప్షన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఫర్మాన్ సిద్ధిఖి ప్రశంసించి, మెడల్‌ను ప్రదానం చేసినట్లు సుభాన్ తెలిపారు. జిల్లాలో జరిగే అన్యాయాలు, లంచాల నివారణకు మరింతగా కృషి చేయాలని ఆయన సూచించినట్లు పేర్కొన్నారు.

నాగభూషణం పదవీ కాలం పొడిగింపు



నాగభూషణం

పుంగనూరు: రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రజిత్ భార్గవ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై నాగభూషణం మాట్లాడారు. తన పదవీ కాలం పొడిగించేందుకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిధున్ రెడ్డి కృషి చేశారంటూ కృతజ్ఞతలు తెలిపారు.

మురుగు కాలువల నిర్మాణ పనులు ప్రారంభం



రామకుప్పం: మండలంలోని చిక్కపల్లి తండాలో సర్పంచ్ నారాయణనాయక్ ఆధ్వర్యంలో మురుగు కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి నిధులతో ఈ పనులకు శ్రీకారం చుట్టినట్టు ఆయన చెప్పారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చిన్నరాజు నాయక్ గ్రామ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన నిధులు మంజూరు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.

రేపటి నుంచి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయం

గుడిపాల: మండలంలోని కందగిరి కొండపై ఉన్న శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వారి ఆలయంలో ఆగస్టు 8, 9 తేదీల్లో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు ఆదివారం తెలిపారు. మంగళవారం భరణి, బుధవారం కృత్తిక కావళ్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి అన్నదానం రెండు రోజుల పాటు కొనసాగుతందన్నారు. రాత్రి వీధినాటకంతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. భక్తులు మొక్కులు చెల్లించుకోవచ్చని చెప్పారు.

ప్రతి ఇంటికీ శుద్ధ జలం ఇవ్వడమే లక్ష్యం



పెద్దకొండామర్రిలో ఆర్వో ప్లాంట్ ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బోయకొండలో విద్యుద్ధీకరణ పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి

- 10 ఆర్వో ప్లాంట్ల ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి
- అభివృద్ధి చేస్తున్నాం..ఆదరించండి

చౌడేపల్లె: పుంగనూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఇంటికీ శుద్ధజలం ఇవ్వడమే తమ లక్ష్యమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆమినిగుంట, చౌడేపల్లె పెద్దకొండామర్రి, దిగువపల్లె, బోయకొండ, కాగతి, కాటిపేరి, పుదిపట్ల,పెద్దయల్లకుంట్ల గ్రామ పంచాయతీల్లో రూ.50 లక్షలతో నిర్మించిన 10 ఆర్వో ప్లాంట్లను మంత్రి ప్రారంభించారు. మొత్తం పది పంచాయతీల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ప్రజలు, మహిళలు, యువత ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రజలతో మమేకమవుతూ ఆప్యాయంగా పలకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వ సహకారంతో మండలాన్ని ఊహించని రీతిలో అభివృద్ధి చేశామన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంతోపాటు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. గ్రామీణ ప్రాంతాల అనుసంధాన రోడ్లను కు కోట్లాది రూపాయలతో తారు రోడ్లుగా మార్చామన్నారు. గ్రామాల్లోని వీధులను సిమెంటు రోడ్లు, అవసరమైన ప్రాంతాల్లో మురుగు



బోయకొండ గంగాపురంలో మొక్కలు నాటి నీరు పోస్తున్న మంత్రి

నీటి కాలువలు సైతం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మద్దతునిచ్చి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికు గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సావిత్రి, వరుణ్, జయసుధమ్మ, సోని, సరిత, షంషీర్, హారతి, రఘురామిరెడ్డి, ఓబుల్ రెడ్డి, ఎంపీటీసీలు షాహీన, శ్రీరాములు, గంగులమ్మ, లక్ష్మీనర్సయ్య, లడ్డూ రమణ, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్‌భరత్, నేతలు నాగభూషణ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, నాగరాజ, అల్తాఫ్, హస్సేన్, సద్దాం, రఘు, మునికృష్ణమనాయుడు, రమేష్‌బాబు ,గిరిబాబు, చిన్నప్ప, మణిరాజు, రాజారెడ్డి, శీనప్ప, రంగనాథ్, రెడ్డెప్పరెడ్డి, శ్రీనివాసులరెడ్డి; తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మంత్రి అన్నారు. బోయకొండ గంగాపురంలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణ, పొలాల గట్లపై విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్ల వలన కలిగే మేలును అటవీ సిబ్బంది ప్రజలకు వివరించాలన్నారు.

జెడ్పీటీసీకి పరామర్శ

జెడ్పీటీసీ సభ్యుడు ఎన్. దామోదరరాజును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పరామర్శించారు. గుండె శస్త్రచికిత్స అనంతరం ఆయన చారాల పంచాయతీ పంజాణి వారిపల్లెలో విశ్రాంతి పొందుతున్నారు. ఆయన ఇంటికి మంత్రి వెళ్లి ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో కొంతసేపు ముచ్చటించారు.



దామోదరరాజును పరామర్శిస్తున్న మంత్రి

గంగమ్మా..ఆశీర్వదించమ్మా!



ఆలయంలో భక్తుల రద్దీ

- బోయకొండకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక అలంకారంలో అమ్మవారి దర్శనం

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరొందిన శ్రీ బోయకొండ గంగమ్మ దీవెనల కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం ఒక్క రోజే సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు బోయకొండకు రావడంతో జనసంద్రంగా మారింది. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలలో భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ



బోయకొండలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ చంద్రమౌళి పర్యవేక్షించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

నేటి నుంచి గడప గడపకు..

పెద్దపంజాణి: మండలంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఎమ్మెల్యే డాక్టర్ వెంకటేగౌడ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. సోమవారం దాసార్లపల్లె, కురప్పల్లె, బసకందొడ్డి, బట్టందొడ్డి, అండిగానిపల్లె, కొత్తూరు, 8న మంగళవారం రామాపురం, గడ్డూరు, జంగాలపల్లె, నిడిగుంట, 9న బుధవారం బండకుంట, కుంబార్లపల్లె, చామనేరు, గోనుమాకులపల్లె, మదరంపల్లె గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటిస్తారని వివరించారు.

తోపుడు బండ్ల వ్యాపారులకు సోలార్ లైట్ల పంపిణీ

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో తోపుడు బండ్ల వ్యాపారులకు ఆదివారం సోలార్ లైట్లను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వంత నిధులతో వీటిని కొనుగోలు చేసి ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, ఎంపీటీసీలు పోకల చంద్ర, రెడ్డి అహమ్మద్, సర్పంచులు షుకూర్, రాణెమ్మ, ప్రతాప్‌రెడ్డి, కల్లూరు ఈఓ యుగంధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

పులిచెర్ల(కల్లూరు): ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ఆయా వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి కోరారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. వివిధ శాఖల



సోలార్ లైట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి

అధికారులు ఆయా శాఖల సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శేషగిరి రావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజశేఖర బాబు, వైస్ ఎంపీపీలు రాశి ప్రసాద్, ఈశ్వరి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, పోకల చంద్ర, రెడ్డి అహమ్మద్, షుకూర్, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్సీ ఆర్థిక సాయం

గుడుపల్లె: మండలంలోని పెద్దపర్తికుంటలో రత్నమ్మ, కుప్పిగానిపల్లెలోని నారాయణప్ప మృతి చెందారు. వారి అంత్యక్రియలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ కేఆర్జే భరత్ రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ఆదివారం ఈ సాయాన్ని జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి ఆయా గ్రామాలకు వెళ్లి మృతుని కుటుంబాలను పరామర్శించి అందజేశారు. సర్పంచ్ అమరనాథ్, రామమూర్తి, ఎంపీటీసీ వెంకటేష్, వెంకటమ్మ, విశ్వనాథ్, రవి, సంపంగి పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేద్దాం



రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ ఎన్జీఓ నేతలు

పలమనేరు: విజయవాడ ఇందిరాగాంధి మున్సిపల్ స్టేడియంలో ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్న ఏపీ ఎన్జీఓల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల సాధన కోసం నిర్వహించనున్న ఈ సభలకు ఉపాధ్యాయ, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఏపీ ఎన్జీఓ అధ్యక్షులు ఆనంద్‌బాబు, కార్యదర్శి జయమ్మ, లక్ష్మీపతి యాదవ్, హరి, రమణ, రమేష్, సురేష్, సోమసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులు

గుడుపల్లె: గుడివంక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. గుడివంక ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో పచ్చటి పందిరి వేసి విద్యుత్ దీపాలతో కల్యాణ వేదికను తీర్చిదిద్దారు. శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామిని పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేసి, వేదికపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల హోరు, వేద మంత్రోచ్ఛరణ నడుమ పండితులు హోమాలు చేసి, శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారికి మంగళ హారతులు సమర్పించిన అనంతరం ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

సుంకోజికి కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారం

పలమనేరు: మనుషుల జీవితాలను కళ్లకు కట్టినట్టు తన రచనల్లో చూపెట్టిన రచయిత సుంకోజి దేవేంద్రాచారి అని పలువురు సాహితీవేత్తలు ప్రశంసించారు. స్థానిక కళామందిరంలో ఆదివారం సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని, రూ.25వేల నగదు బహుమతిని తన తల్లి జ్ఞాపకార్థం ప్రముఖ రచయిత పలమనేరు బాలాజి ఆయనకు అందజేసి సత్కరించారు. పలువురు సాహితీవేత్తలు వెంకటక్రిష్ణ, వీఆర్ రాసాని, అదనపు ఎస్పీ సుధాకర్, ఉమామహేశ్వరావు మాట్లాడారు. ×అన్నం గుడ్డ¥ తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ నిలిచే మంచి కథ అని, ఇందులో రాయలసీమ రైతాంగ జీవితాన్ని, వారికి నీరు, నేలతో ఉన్న అనుబంధాన్ని అద్భుతంగా ఆవిష్కరించారన్నారు. మూడు దశాబ్దాల ఆయన సాహితీ సేవలకు గుర్తింపుగా కేఎన్ జయమ్మ పురస్కారాన్ని అందుకోవడం హర్షదాయకమన్నారు. మనిషి జీవితంలోని పచ్చి నిజాలను ఉన్నది ఉన్నట్టుగా మనకు కనిపించేలా ఆయన తనశైలిలో రాస్తున్న కథలు పాఠకులను ఎక్కడికో తీసుకెళతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రాయలసీమలోని రైతుల బతుకులు, మహిళల కడగండ్లు, బహుజన జీవితాల్లోని ఉద్వేగాలు ఇందులో కనిపిస్తాయని విశ్లేషించారు. ఎక్కడైతే అణచివేత, పీడన ఉంటుందో అక్కడి నుంచి ఇలాంటి మంచి సాహిత్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా రచయితల సంఘ గౌరవాధ్యక్షులు కట్టమంచి బాలక్రిష్ణారెడ్డి, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, కార్యదర్శి పుష్ప, ఆముదాల మురళి, శివశంకర్, డీడీఓ విద్యారమ, ఎంఈఓ శ్రీనివాసులు, సీనియర్ అధ్యాపకురాలు సంధ్యారాణి, హెచ్ఎం నేతాజి, సీతారామయ్య, జేవీవీ నాయకులు యుగంధర్, గిరిధర్, పలమనేరు రచయితల సంఘ గౌరవాధ్యక్షులు మాధవ్, సాహిత్య ఆకాడమీ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, స్థానిక రచయితలు గండికోట వారిజ, కుమారస్వామి రెడ్డి, గంటామోహన్, ఎండపల్లి భారతి, డాక్టర్ కవితశ్రీ, శ్రీనివాస, సురేంద్రనాథ్, గోపీనాథ్, ఉమాపతి, మల్లిచెట్ల దేవేంద్ర, దోర్నాదుల సిద్ధార్థ, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.



సుంకోజికి కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేస్తున్న పలమనేరు బాలాజి, సాహితీవేత్తలు

విద్యార్థిని అనుమానాస్పద మృతి



కీర్తి(ఫైల్)

సదుం: అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని శవమై వెలుగులోకి వచ్చిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు..అన్నమయ్య జిల్లా పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ గుర్రంవారిపల్లెకు చెందిన కీర్తి(18) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఉదయం సదుం మండలం తాటిగుంటపాలెం పంచాయతీలో సరిహద్దు ప్రాంతంలో ఉన్న తమ పొలాల వద్దకు ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి కీర్తి బయలు దేరింది. ఇంటికి మధ్యాహ్నం అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ అని రావడంతో వారు యువతి కోసం పొలాల వద్దకు వచ్చి చూడగా, హంద్రీ-నీవా కాలువలో ఆమె అచేతనంగా పడి ఉండటం గుర్తించారు. ఆమెను తమ గ్రామానికి తీసుకువెళ్లేసరికి అప్పటికే మృతి చెందిందని గుర్తించారు. సమాచారం అందుకున్న పీలేరు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. యువతి పడి ఉన్న ప్రాంతం ఏ మండలం పరిధిలోకి వస్తుందనే స్పష్టం లేకపోవడంతో సదుం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ మారుతి అక్కడికి వెళ్లి పరిశీలించారు. చివరకు ఆ ప్రాంతం పీలేరు పరిధిలోకి వస్తుందని తేల్చారు. పీలేరు పోలీసులు నమోదు చేయనున్నట్టు ఎస్ఐ మారుతి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పీలేరు తరలించారు. ఇదలా ఉంచితే, విద్యార్థిని మృతదేహంపై గాయాలు ఉన్నట్లు తెలియవచ్చింది. విద్యార్థిని కాల్ డేటా, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా యువతి మృతి కేసును పోలీసులు ఛేదించాల్సి ఉంది.

ముగిసిన నాగాలమ్మ జాతర

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ఎస్టేట్‌లోని ఆటోనగర్‌లో నాగాలమ్మ జాతర ఆదివారంతో ఘనంగా ముగిసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రీతికరమైన పదార్థాలను నైవేద్యం సమర్పించారు. పలువురు మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారిని నిమజ్జనం చేశారు.

శ్రీకృష్ణుడే జగద్గురువు



కుప్పం రూరల్ : ప్రబోధానంద రచనలపై ప్రచారం చేస్తున్న ప్రతినిధులు



శాంతిపురం : కెనమాకులపల్లెలో..



పలమనేరు : టి.వడ్డూరులో..

కుప్పం రూరల్: చరాచర జగత్తుకు శ్రీకృష్ణుడు ఒక్కడే గురువని ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతతో బోధపడుతుందని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని గరిగచీనేపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ, గుంద్రము- అనే పదం నుంచే గురువు అనే అర్థం ఉద్భవించిందని, చరాచర జగత్తుకు శ్రీకృష్ణ పరమాత్ముడే గురువని పేర్కొన్నారు. అనంతరం ప్రబోధానంద రచనలను గ్రామ ప్రజలకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, కృష్ణారెడ్డి, నాగరాజు, శరవణ, చరణ్, లోకేష్, వాణి, వెంకటలక్ష్మి, తిమ్మక్క, బిందు, యశస్విని పాల్గొన్నారు.

శాంతిపురంలో..

శాంతిపురం: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం కెనమాకులపల్లె ప్రచారం నిర్వహించారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మల గురించి తెలుసుకుని భగవంతుని ఆరాధిస్తే ధర్మస్థాపన జరుగుతుందని శివరామపురానికి చెందిన ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు కృష్ణమూర్తి చెప్పారు. మొదలు, చివర లేని జ్ఞాన సంపన్నుడైన శ్రీకృష్ణుడు జగద్గురువన్నారు. పురాణాలను చదివితే యువత, పిల్లలు మన సంస్కృతి గొప్పదనాన్ని తెలుసుకుని ఆచరించవచ్చన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు రంగప్ప, జనార్ధన్‌రెడ్డి, రమేష్, చిన్నక్క, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

టి.వడ్డూరులో..

పలమనేరు : పట్టణానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రచారకులు ఆదివారం మండలంలోని టి.వడ్డూరులో చేశారు. కమిటీ సభ్యులు భాస్కర్, బాలాజి, జ్యోతి, వాణిశ్రీ, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వేపచీర్ల తిరునాళ్లు



తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లెలో వెలసిన ఆరివేణి గంగమ్మ గుడి వద్ద ఆదివారం సాయంత్రం వేపచీర్ల తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు నెరవేర్చే ఆరివేణి గంగమ్మకు ప్రతి ఏటా ఆడి మాసంలో ఈ తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు ఒంటికి కేవలం వేపాకు మాత్రమే చుట్టుకుని అమ్మవారి గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించుకుంటారు. అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చుతారని ప్రగాఢ విశ్వాసంతో భక్తులు వేపచీర్లు సమర్పిస్తారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మ వారికి పొంగళ్ళు పెట్టి అభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ పూజల అనంతరం నైవేద్యం సమర్పించారు. తర్వాత వేపాకు ఒంటికి చుట్టూ కట్టుకొని పురుషులు, మహిళలు, పెద్దలు, పిల్లలు అమ్మ వారి గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా పశువులకు అమ్మ వారు రాకుండా, ఎలాంటి రోగాలు రాకుండా కాపాడు తల్లీ అంటూ వేపాకు మెడకు కట్టి ప్రదక్షిలు చేయించి మొక్కులు తీర్చుకొన్నారు.